తెలుగు దిన పత్రికలో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను
మండలం । నియోజకవర్గం । జిల్లా
వారీగా రిపోర్టర్లు కావలెను
9908502602

PRGI: TGTEL/26/A6429

# యువ వెలుగు

E- Paper, www.yuvavelugu.com
తెలుగు దిన పత్రిక

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!



- వార్త 2 లో..

సంపుటి : 01 సంచిక : 28 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | గురువారం 01-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-

## కెపాసిటీ బిల్డింగ్‌పై ప్రభుత్వ ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ

- పట్టణాల్లో తాగునీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దు
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ⏭ తరువాయి 2లో..

## 'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం



- కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు
- కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ
- బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు
- దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు

**సిరిసిల్ల, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే ..**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి మిగతా 2లో

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు: కేటీఆర్



**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు.

- మిగతా 2లో..

## అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఉత్తరాంధ్రను అభివృద్ధి బాటలో నడిపిస్తాం!

### మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి



**విశాఖపట్నం, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** నా రాజకీయ జీవితం ఉత్తరాంధ్రతో ముడిపడి ఉందని, త్వరలో పెట్టబోయే రాజకీయ పార్టీ ద్వారా అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఉత్తరాంధ్ర సర్వతో ముఖాభివృద్ధికి గట్టిగా పాటుపడతానని రాజ్యసభ మాజీ సభ్యుడు, వైసీపీ మాజీ సీనియర్ నాయకుడు వేణుంబాకం విజయ సాయి రెడ్డి ఉద్వేగంగా పేర్కొన్నారు. విశాఖలో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను విశాఖలోనే నివాసం ఉంటున్నానని, నా హృదయంలో విశాఖ ఉందన్నారు. వైసీపీ, టీడీపీలకు మూడో ప్రత్యామ్నాయం అవసరం ఉందన్నారు. రెండూ కుటుంబ పార్టీలేనని, ప్రత్యేక హోదా ఇవ్వకున్నా కేంద్రాన్ని అడగడం లేదని విమర్శించారు. ⏭ తరువాయి 2లో..



## 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'

### జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు

కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు 2




## తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర

### సేవా సంకల్ప యాత్రను ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు



**తిరుపతి, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను ఆయన ప్రారంభించారు. ⏭ తరువాయి 2లో..



## వరుసగా మూడో రోజూ నష్టాల్లో మార్కెట్లు

### సెన్సెక్స్ 48 పాయింట్లు డౌన్

**న్యూఢిల్లీ, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి.

తరువాయి.. 2లో..

## ఏపీలో పెట్టుబడుల ప్రవాహానికి ముంబై రోడ్‌షో శ్రీకారం

- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు వివరించేందుకు, నూతన భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (అఐఐ) సంయుక్తంగా ముంబైలో బుధవారం భారీ 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షో' నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి ⏭ తరువాయి 2లో..

# కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య
- గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం



**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు.

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం

## టేకాఫ్ అయిన కొద్దిసేపటికే వెనక్కి

**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 45 మంది ప్రయాణికులతో శంషాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. విమానం గగనతలానికి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. వారి అనుమతితో విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు.

# నా పాస్‌పోర్ట్‌ను మోదీ, అమిత్ షా అడ్డుకుంటున్నారా : కేఏ పాల్



**న్యూఢిల్లీ, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై సంచలన ఆరోపణలు చేశారు. తన పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయవద్దని వారేమైనా ఆదేశాలు జారీ చేశారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం ముందు నిలబడి రికార్డ్ చేసిన ఒక వీడియోలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూడు నెలల క్రితం పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నా, ఇప్పటికీ రాకపోవడం షాక్‌కు గురిచేసిందని పాల్ తెలిపారు. మోదీ, అమిత్ షా తనకు మంచి మిత్రులని చెబుతూనే, ఈ జాప్యం వెనుక వారి ఆదేశాలు ఉన్నాయా? లేక విదేశాంగ మంత్రి జైశంకర్ ఏమైనా చెప్పారా? అని అనుమానం వ్యక్తం చేశారు. తాను భారత్‌కు వస్తున్నాననే కారణంతో గానీ, ఎఫ్‌సీఆర్ఏ సమస్యల వల్ల గానీ తన పాస్‌పోర్ట్‌ను అడ్డుకుంటున్నారా? అని ఆయన నిలదీశారు. 2024 ఎన్నికల ప్రచారం సందర్భంగా విజయనగరంలో తనపై నమోదైన కేసును కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ ఘటనలో ఒక యువకుడు చనిపోతే, నిరసన చేస్తున్న వారిని తాను సముదాయించి పంపించానని, మంచి పని చేసినా తనపై కేసు పెట్టారని పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కేసు ఇంకా కొట్టివేయలేదని, దాని కారణంగానే పాస్‌పోర్ట్ నిలిపివేశారా? అని ప్రశ్నించారు. ఈ 'చిన్న' విషయంపై తాను ఎక్కువగా మాట్లాడదలచుకోలేదని, తాను నోరు విప్పితే అనవసర సమస్యలు వస్తాయని మోదీ, అమిత్ షాలను హెచ్చరించారు. న్యాయపరమైన చర్యలు తీసుకునేలోపే తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# 'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు.

ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

# వరుసగా మూడో రోజూ నష్టాల్లో మార్కెట్లు

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అమెరికా-ఇరాన్ చర్చల్లో పురోగతి ఉంటుందన్న ఆశలు తగ్గడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. బుధవారం సెన్సెక్స్ 48.78 పాయింట్లు నష్టపోయి 72,480.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.75 పాయింట్లు పడిపోయి 22,620.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి 22,600-22,550 స్థాయి తక్షణ మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 22,500 కంటే దిగువన నిలకడగా ట్రేడైతే 22,300 స్థాయికి పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. 22,800 వద్ద తక్షణ నిరోధం ఉందని చెప్పారు. హెల్త్‌కేర్, ఫార్మా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్, బీఎస్ఈ తదితర షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే విస్తృత మార్కెట్‌లో కొంత స్థిరత్వం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.02 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.27 శాతం లాభపడ్డాయి. రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, మీడియా రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి. హెల్త్‌కేర్, ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ రంగాలు వెనుకబడ్డాయి. చమురు ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు మళ్లీ పెరిగాయని నిపుణులు తెలిపారు. దీని ప్రభావం కంపెనీల ఆదాయాలు, ఆర్థిక వృద్ధిపై పడొచ్చన్న భయాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్థూల ఆర్థిక పరిస్థితిపై స్పష్టత వచ్చే వరకు బలమైన ఆర్థిక ఫలితాలు ఉన్న కంపెనీలపైనే ఇన్వెస్టర్లు దృష్టి పెట్టే అవకాశం ఉందన్నారు.

# 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'

## జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

**అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు.

వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు.

హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ.40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు. హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్‌అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

## అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఉత్తరాంధ్రను

# అభివృద్ధి బాటలో నడిపిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

నెలకు 350 కోట్లు రూపాయలు రాయలసీమకు తరలిస్తున్నారని, కేంద్రంలో మంత్రి పదవుల కోసమే టీడీపీ సిద్ధమవుతోందని, వారికి సిద్ధాంతం లేదు, పదవులే ముఖ్యమని అన్నారు. లోకేష్ కి సీఎం పదవే లక్ష్యమని, జగన్ లక్ష్యం కూడా అదేనని ఎద్దేవా చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రాలేదని, సంపద అంతా రెండు కుటుంబాల జేబుల్లోకే వెళ్తోందని, ఉపాధి కల్పన ఎక్కడని ప్రశ్నించారు. ఎయిర్ పోర్ట్, గూగుల్ ఘనత మాదే అని వైసీపీ, టీడీపీ కొట్లాడు కుంటున్నాయని, పారిశ్రామిక వేత్తలు ఏపీ నుంచి పారిపోతున్నా రన్నారు. యువత మూడో ప్రత్యామ్నాయాన్ని గుర్తించిందని, రెడ్ బుక్, రఫ్ఫా రఫ్ఫా లకు చోటు లేదన్నారు. కుల పిచ్చి పార్టీ కావాలా అని నిలదీశారు. యువతరం నుంచే పాలకులు రావాలని, తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు కమ్మ, క్రిస్టియన్ పాలకులే ఉన్నారని, బడుగులకు అధికారం లేదని, వీరికి అధికారమే లక్ష్యమని, రెండు పార్టీలకు కులం, మతం పిచ్చి ఉందని విమర్శించారు. ఆంధ్రా యూనివర్సిటీ తన మనసులో అలాగే ఉందని, గీతం అభివృద్ధే సీఎంల లక్ష్యమని, ఏయూని దెయ్యాల కొంప అని దివంగత ఎంవీవీఎస్ మూర్తి అన్నారని గుర్తు చేశారు. 54.79 ఎకరాలు, 5 వేల కోట్ల భూమిని గీతంకి ఎలా దారాదత్తం చేశారని, ఎంపీ భరత్ వెయ్యి కోట్లు అన్నారని, సర్కార్ కి ఎంత చెల్లించారని ప్రశ్నించారు. దేశ విభజనకు కారణం కాంగ్రెస్ అని, అలాంటి కాంగ్రెస్ తో వైసీపీ ఎలా పొత్తు పెట్టుకుంటుందని, వైసీపీ, టీడీపీ మహా నటులని అన్నారు. సీఆర్డీఏకు, అమరావతికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఇప్పటికే 70 వేల కోట్లు ఖర్చు చేశారని, ఇంకా పరిమితి లేని అప్పులు చేస్తున్నారని అన్నారు. ఈ రుణ భారం ఉత్తరాంధ్ర, రాయలసీమ మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర డెవలప్ మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తామని, ఏటా బడ్జెట్ లో 10 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నీటి పారుదల, వలసల నివారణ, రోడ్ల నిర్మాణంపై దృష్టి పెడతా మన్నారు. ఉద్దానంలో నేటికీ ఆపరేషన్లు చేసే పరిస్థితి లేదని, ప్రజలకు సురక్షితమైన తాగునీరు కూడా అందుబాటులో లేదన్నారు. శారదా, వేగవతి తదితర అన్ని నదులను అనుసంధానం చేసి, ఆక్రమణలు తొలగించి కరువు లేకుండా చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర జనాభా 19 శాతం ఉందని, వంశధారలో 600 టీఎంసీల నీరు ఉన్నా వినియోగం లేదని, 2800 పంచాయతీలకు నీరు, రోడ్లు కల్పిస్తామని, ఎకరం 99 పైసలకే ఇవ్వడం కంటే, పారిశ్రామిక అభివృద్ధి మీద దృష్టి పెట్టాలన్నారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, ఆదివాసీలకు సంబంధించిన జీవో నంబర్ 5ను చట్టబద్ధం చేస్తామని, గంజాయిని నిర్మూలిస్తామని, గిరిజన సంస్కృతిని కాపాడతా మన్నారు. 1994 మరియు 1999 నుంచి 2004లో వాజ్ పేయి హయాంలో పని చేసిన దిలీప్ మతమార్పిడి ప్రయత్నాల నిర్మూలనకు కృతువు చేస్తున్నారని, మళ్లీ వారిని ఆదివాసీలుగా వచ్చేలా చేస్తామన్నారు. విశాఖకు ఆ రెండు కుటుంబాలు చేసింది ఏమీ లేదన్నారు. రాజధాని విషయంలో మాట తప్పిన వైసీపీ ఇప్పుడు మావిగన్ అనడం యూటర్న్ సిద్ధాంతమని, దీనికి వైసీపీ ఉత్తరాంధ్రకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. షుగర్ ఫ్యాక్టరీలు మూతపడి రియల్ ఎస్టేట్ గా మారిన తుమ్మపాల, గోవాడ ఫ్యాక్టరీల రైతులకు బకాయిలు చెల్లించక ఇక్కట్లు పెడుతున్నారని, రైవాడ భూములు ఇచ్చిన వారికి నీరే లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ప్రకటించిన శ్రీకృష్ణ కమిటీ ఒక బూటకమని ఆయన ధ్వజ మెత్తారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజల ఓట్లు తొలగించడం లేదని, ఈ విషయంలో కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. నేడు పిల్లలు మొబైల్ కి బానిస అవుతున్నారని, సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తామన్నారు. త్వరలో ఉత్తరాంధ్ర అంతటా పాదయాత్ర చేసి స్థానిక సమస్యలు తెలుసుకుని ముందుకు వెళ్తామని ప్రకటించారు.

# ఏపీలో పెట్టుబడుల ప్రవాహానికి ముంబై రోడ్‌షో శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ రోడ్‌షోలో ప్రముఖ పారిశ్రామిక సంఘాలు, వాణిజ్య సంస్థలు, విదేశీ వాణిజ్య ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు కావలసిన భూమి, సహజ వనరులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ, పెట్టుబడులను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఈ రోడ్‌షోలో ప్రధానంగా బీఎఫ్ఎస్ఐ & ఫిన్‌టెక్, జౌళి-వస్త్ర రంగం, ఫార్మాస్యూటికల్స్ & లైఫ్ సైన్సెస్, కెమికల్స్ & పెట్రోకెమికల్స్, పోర్టులు & షిప్పింగ్ లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ & ఎఫ్ఎమ్‌సిజి, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగాలలో ఉన్న విస్తృత అవకాశాలను ప్రత్యేకంగా వివరించారు. ఇక ప్రభుత్వం 3S కాన్సెప్ట్ ( స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సర్వీస్, స్టెబిలిటీ ) విధానంతో పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

**విశాఖ సదస్సుకు సన్నాహాలు:** రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర వ్యూహంలో భాగంగా ఈ రోడ్‌షో నిర్వహించినట్టు మంత్రి తెలిపారు. ఈ రోడ్ షో నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'కు ఆరంభ వేదికగా నిలిచిందన్నారు. ఈ రోడ్‌షో ద్వారా మహారాష్ట్రకు చెందిన ప్రముఖ కంపెనీలు రాబోయే విశాఖ సదస్సులో పాల్గొని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలు మరింత విస్తృతమైనట్టు మంత్రి తెలిపారు.

# తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.

అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు

**అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్-2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

**యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం**

యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది**

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

**డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

# కెపాసిటీ బిల్డింగ్‌పై ప్రభుత్వ ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖలు అందించే సేవలపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ, అన్నక్యాంటీన్లు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సంక్షేమ హాస్టళ్లల్లో వసతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించామని... రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారన్నారు. వివిధ వర్చువల్ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియేంటేషన్ తీసుకుంటూ స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకుంటారో... అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు




**కాళేశ్వరం, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనానికి యత్నించిన బీజేపీ నాయకులను బుధవారం రోజున పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఇటీవల ఢిల్లీలో ఒక మీడియా సంస్థ ఇంటరాక్టివ్ సెషన్ లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "ఉత్తరాదిలో శ్రీరాముడిని ఎక్కువగా పూజిస్తారు, దక్షిణాదిలో శివుడిని పూజిస్తారు. శ్రీరాముడు ధనవంతుల దేవుడు, శివుడు పేదల దేవుడు, బీజేపీ ధనవంతుల పార్టీ అందుకే రాముడిని వాడుకుంటోంది" అని వ్యాఖ్యానించారని, ఈ వ్యాఖ్యలు హిందూ మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి వెళ్ళనీయకుండా కాళేశ్వరం పోలీసులు బీజేపీ నాయకులను పోలీస్ స్టేషన్ కు తరలించి ముందస్తుగా అరెస్టు చేశారు. సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల కేంద్రాల్లో భారీ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు గోర శ్రీకాంత్, బొల్లం కిషన్ ఉన్నారు.

# రహదారిపై అడ్డగోలుగా పార్కింగ్

**నందిగామ, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** రహదారులపై అడ్డగోలుగా, నిబంధన లకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. నందిగామ మండల కేంద్రంలో బైపాస్ సబ్ రోడ్డుపై అడ్డగోలుగా ఎం ఎస్ ఎన్ పరిశ్రమకు సంబంధించిన వాహనాలు నిలుపుతూ వాహనదారులకు ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారు. ప్రతిరోజు ఉదయం ఎం ఎస్ ఎన్ పరిశ్రమకు చెందిన వాహనలు బైపాస్ రోడ్డులో ఇలానే దర్శనమిస్తున్నాయి. డ్రైవర్ ను ఇదేమిటని ప్రశ్నించగా అడ్డగోలుగా సమాధానం ఇస్తున్నారు. ఇతర డ్రైవర్లను అడగగా ఈ బండి అతను రోజు ఇదే తతంగం అని చెప్పిన వినడం లేదని, ప్రశ్నించిన వారిపై అంతా నా ఇష్టం మీరు ఏంది నాకు చెప్పేది అని ఇష్టా రాజ్యంతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడు అని తెలిపారు.. ట్రాఫిక్ & పోలీసులు రహదారిపై పార్కింగ్ పై స్పందించి అడ్డగోలుగా పార్కింగ్ చేసే వాహనాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోడీ ఫోటో తప్పనిసరిగా ఉండాల్సిందే..

## బీజేపీ మండల అధ్యక్షులు కొండా గోపి డిమాండ్




**చింతకాని, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి ఫోటో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ చింతకాని మండల అధ్యక్షులు కొండా గోపి డిమాండ్ చేశారు. మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ ప్రధాన మంత్రుల ఫోటోలు కనిపిస్తున్నప్పటికీ, ప్రస్తుత దేశ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ గారి ఫోటోలు లేకపోవడం సరికాదని ఆయన అన్నారు. మాజీ ప్రధానులు ఫోటోలు ఉంటే.. ప్రస్తుత ప్రధాని ఫోటో ఎందుకు లేదు.? ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుత ప్రధానమంత్రి ఫోటోను ఏర్పాటు చేయడం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కొండా గోపి కోరారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు ప్రభుత్వ కార్యాలయంలో ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక ప్రదర్శనలు నిబంధనలుకు అనుగుణంగా ఉండాలని ఎక్కడైనా లోపాలు ఉంటే సంబంధిత అధికారులు వెంటనే సరిదిద్దాలని ఆయన కోరారు.ప్రజలు సేవలు అందించే ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మంత్రి ఫోటో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కొండా గోపి డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ

## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**దుబ్బాక, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** దుబ్బాక నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. దుబ్బాక మండలం హబ్సీపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, చెప్యాల్ చౌరస్తాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారికి అనుకూలమైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ**

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... లబ్ధిదారులకు మంజూరైన ఇంద్ర మహిళను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, కమిషనర్ మహేష్ కుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, బి ఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఇల్లందుల శ్రీనివాస్, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అవసరమగు పరికరాలు అందించండి

## జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన దివ్యాంగులు




**వికారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ప్రభుత్వం దివ్యాంగులకు బాసటగా ఉంటూ వారికి అవసరమగు పరికరాలు అందించాలని బివి ఎచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ అన్నారు. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీని కలసి దివ్యాంగులు విన్నతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు వివిధ రకాల సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన పరికరాలను మంజూరు చేయ వలసిందిగా కోరారు. జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో అనేకమంది దివ్యాంగులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ నిత్యజీవిత అవసరాలకు ఉపయోగపడే సహాయ పరికరాలను కొనుగోలు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా నడవడానికి, వినడానికి, చూడడానికి మరియు స్వతంత్రంగా జీవించడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల బ్రతకు ఇబ్బందిగా మారిందన్నారు.

కావున జిల్లాలోని అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన సహాయ పరికరాలను ఉచితంగా అందించేందుకు సంబంధిత శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు మరియు సహాయ పరికరాల పంపిణీ శిబిరాలను ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, వాకింగ్ స్టిక్స్, క్రచెస్, వాకర్స్, కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ మరియు ఇతర ఆర్థోపెడిక్ పరికరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బి.వి.హెచ్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. చుక్కయ్య. వికారాబాద్ పట్టణ అధ్యక్షులు ఆలయం గణేష్, వికారాబాద్ జిల్లా సలహాదారులు హనుమంతు, సురేష్, నారాయణ, జంగయ్య పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు దుండిగల శ్రీనును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నోముల



**హాలియా, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** అనుముల మండలం నాయుడు పాలెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దుండిగల శ్రీను తండ్రి దుండిగల సోములు అనారోగ్యంతో ఇటీవల మరణించడం జరిగింది. నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ బుధవారం నాయుడుపాలెం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి సోములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కర్ణ నర్సిరెడ్డి,కురాకుల వెంకటేశ్వర్లు,వడ్డే సతీష్ రెడ్డి, వర్ర వెంకట్ రెడ్డి,సర్పంచులు కూన్ రెడ్డి భాస్కర్ రెడ్డి, మజ్జిగపు నర్సిరెడ్డి,చేగొండి కృష్ణ,లకుమాల మధు బాబు,బుర్రి వెంకటేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పట్టణంలోని పదవ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ



**పెద్దపల్లి టౌన్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని 10 వార్డు చీకురాయి రోడ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ కానుక ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమం స్థానిక కౌన్సిలర్ శ్రీమతి శ్రీ అక్కేపల్లి సుజాత క్రాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై వార్డ్ మహిళలకు చీరలను పంపిణి చేశారు ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సత్తు శ్రీనివాస్, ఆర్పీ స్రవంతి, వార్డ్ మహిళలు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ఖ్యాతిని ప్రపంచ వేదికపై చాటిన తనిపర్తి చికిత్స




**పెద్దపల్లి టౌన్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ఏషియన్ గేమ్స్ 2026 ఆర్చరీ పోటీల్లో చైనాపై ఘన విజయం సాధించి, ప్రపంచ రికార్డును సమం చేస్తూ స్వర్ణ పతకం కైవసం చేసుకోవడంతో పాటు, సాహిల్ జాదవ్‌తో కలిసి మిక్సెడ్ జట్టు విభాగంలోనూ స్వర్ణ పతకం సాధించినందుకు ప్రత్యేక అభినందనలు. చికితతో పాటు అద్భుత ప్రతిభ కనబరిచిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్‌లకు శుభాకాంక్షలు. సుల్తానాపూర్ గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి గర్వకారణంగా నిలిచిన చికిత ప్రయాణం మన యువతకు స్ఫూర్తిదాయకం

# హుండీల లెక్కింపు వాయిదా

**కాళేశ్వరం, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** మహాదేవపూర్ మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం యొక్క హుండీ లెక్కింపు గురువారం జరుగవలసివుండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధి కారి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని నిర్ణయించి తెలియజేస్తామని పేర్కొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**అన్నపురెడ్డిపల్లి, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామానికి చెందిన కొత్తూరు రామారావుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.28 వేల చెక్కును అబ్బుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు మరకాల లక్ష్మారెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కృషితో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఈ ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మరకల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కొత్తూరు రామారావుకు రూ.28 వేల ఆర్థిక సహాయం మంజూరు చేయడంలో కృషి చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు అబ్బుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్రం కృష్ణ, పులిచెర్ల రామారావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రంలో శ్రీవాణి సాంస్కృతిక సంస్థ శివనామ సంకీర్తన

## శివనామ స్మరణతో మార్మోగిన శ్రీశైలం

## భక్తులను మంత్రముగ్ధులను చేసిన భజనలు

## మల్లికార్జున సన్నిధిలో భక్తి గీతాల ఆలాపన.. తొమ్మిది రోజుల భజనల అనంతరం ప్రత్యేక సంకీర్తన




**కొందుర్గు, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** శ్రీశైలం శివమయం.. మల్లికార్జున స్థావరం.. శివనామ స్మరణతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే శ్రీశైల క్షేత్రంలో శ్రీవాణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శివనామ సంకీర్తన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి నిత్య సంకీర్తన వేదికపై నిర్వహించిన ఈ ప్రత్యేక భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శివుని నామస్మరణతో పాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించే భక్తి గీతాలను ఆలపిస్తూ సభ్యులు భక్తులను మంత్రముగ్ధులను చేశారు. గణపతి నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భజన కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీవాణి సాంస్కృతిక సంస్థ సభ్యులు, ఆ కార్యక్రమాల అనంతరం శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి సన్నిధిలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివుని మహిమను కీర్తించే అనేక భక్తి గీతాలను ఆలపించారు.

"శ్రీశైలం శివమయం.. మల్లికార్జున స్థావరం", "శంకరా నాదశరీరాపరా", "ఎవరికీ ఎవరయ్యా ఈశ్వర" వంటి శివ కీర్తనలను ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలపించడంతో శ్రీశైల క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. భక్తి గీతాల ఆలాపనకు అనుగుణంగా సభ్యులు తాళాలు వేస్తూ, భజనలో పాల్గొనడంతో అక్కడ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మల్లికార్జున స్వామి సన్నిధిలో శివనామ సంకీర్తన నిర్వహించడం తమకు ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని సంస్థ సభ్యులు తెలిపారు. శివుని నామస్మరణ, భజన, సంకీర్తనల ద్వారా మనసుకు ప్రశాంతత లభించడంతో పాటు భక్తి భావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. భక్తి సంగీతం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో శ్రీవాణి సాంస్కృతిక సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.

**తొమ్మిది రోజుల భజనల అనంతరం శ్రీశైలంలో ప్రత్యేక కార్యక్రమం**

గణపతి నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన భజన కార్యక్రమాల్లో శ్రీవాణి సాంస్కృతిక సంస్థ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి నవరాత్రులలో భక్తి గీతాలు, భజనలు, సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పిన అనంతరం, అదే భక్తి పరంపరను కొనసాగిస్తూ శ్రీశైల క్షేత్రంలో శివనామ సంకీర్తన నిర్వహించారు.

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి నిత్య సంకీర్తన వేదికపై భజన కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది. శివుని నామాన్ని స్మరిస్తూ భక్తి గీతాలను ఆలపించిన సమయంలో అక్కడికి వచ్చిన భక్తులు సైతం భజన కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. కొంతసేపు భక్తి సంగీతంలో మమేకమైన భక్తులు శివనామ స్మరణలో పాల్గొన్నారు.

**భక్తి సంగీతంతో ఆధ్యాత్మిక చైతన్యం**

ప్రస్తుత సమాజంలో ఒత్తిడి, పరుగుల జీవితానికి కొంత ఉపశమనం కలిగించేందుకు భజన, సంకీర్తన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. భక్తి సంగీతం ద్వారా మనసుకు ప్రశాంతత చేకూరడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు.

తెలుగు సంస్కృతిలో భజన, హరికథ, సంకీర్తనలకు ప్రత్యేక స్థానం ఉందని, పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శ్రీవాణి సాంస్కృతిక సంస్థ తరఫున భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ కళాకారులను, భజన బృందాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**శివనామంతో మార్మోగిన క్షేత్రం**

శ్రీశైల క్షేత్రంలో శివనామ సంకీర్తన ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు భక్తి భావం ఉట్టిపడింది. శివ కీర్తనల ఆలాపనతో వాతావరణం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. "శ్రీశైలం శివమయం.. మల్లికార్జున స్థావరం" అంటూ శివుని మహిమను కీర్తిస్తూ ఆలపించిన భక్తి గీతం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఇతర శివ కీర్తనలను కూడా ఆలపిస్తూ భజన కార్యక్రమాన్ని కొనసాగించారు.

భక్తి గీతాల మధ్య తాళాలు, మృదంగం తదితర వాద్యాల నాదంతో కార్యక్రమం మరింత శోభాయమానంగా సాగింది. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి సన్నిధిలో శివనామ స్మరణలో పాల్గొనడం తమకు మరపురాని అనుభూతి అని కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు తెలిపారు. ఈ శివనామ సంకీర్తన కార్యక్రమంలో గురువుగారు మనోహర చారి, నాటక రంగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి చారి, శ్రీవాణి సాంస్కృతిక సంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పరంధాములు గౌడ్, కన్నా మాస్టర్, గోపాల్ రెడ్డి, బాలకృష్ణ, గౌరి శంకర్, సురేష్, సురేందర్, రఘురాం చారి, గణేష్, ఇస్తారి, సాయిరెడ్డి, నర్సింలు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులంతా భక్తిశ్రద్ధలతో శివనామ సంకీర్తనలో పాల్గొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని స్మరించుకున్నారు. భక్తి, సంగీతం, సంస్కృతి సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం శ్రీశైల క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభను మరింత పెంచింది. శివనామ సంకీర్తన ద్వారా భక్తి భావాన్ని పెంపొందిస్తూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ.. భక్తి సంగీతాన్ని భావితరాలకు అందించడమే శ్రీవాణి సాంస్కృతిక సంస్థ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



# మీర్పేట్ నారాయణ స్కూల్‌లో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

## ముఖ్య అతిథులుగా జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్ర బాబు, మీర్పేట్ ఉమెన్ ఎస్సై రమణ

**మీర్పేట్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** చిన్నారి విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నారాయణ స్కూల్ ఏజీఎం రవీంద్ర బాబు అన్నారు. ఈరోజు మీర్పేట్ నారాయణ స్కూల్‌లో ఈ-కిడ్స్ విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు స్వయంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాబ్జీ , ఆర్అండ్‌డీ హెడ్స్ మీనా, మహేశ్వరి, శివరంజని, కోఆర్డినేటర్స్ ప్రియాంక, దివ, సృజన్, ఏడీ నాగిరెడ్డి, ఏవో మాధవి , వైస్ ప్రిన్సిపల్స్ అనుషా, మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.









# సిరిసిల్ల పెద్దబోనాల 22వ వార్డులో తాగునీటి కష్టాలు

### పొలాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు



**సిరిసిల్ల టౌన్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** పెద్ద బోనాల 22వ వార్డులో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురికి నల్లా కనెక్షన్లు లేకపోవడంతో పొలాల వద్ద నుంచి ఆటోల్లో నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెల కొందని స్థానికులు వాపోతున్నారు. నీటి సమస్యపై పలుమార్లు వార్డు కౌన్సిలర్‌కు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా తాగునీటి సరఫరా ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. తమ సమస్యపై మున్సిపల్ నుంచి స్పష్టమైన సమాధానం కూడా రావడం లేదని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి 22వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సేవకు విరమణ లేదు

### వైద్య ఆరోగ్య సంచాలకులు రవీంద్ర నాయక్




**మహబూబాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** ఉద్యోగానికి పదవీ విరమణ ఉన్నా.. ప్రజాసేవకు మాత్రం లేదని తెలంగాణ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. తొర్రూరు ఉప జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ సుదీర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన సన్మాన కార్యక్రమాన్ని మహబూబా బాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో సుదీర్‌రెడ్డి చూపిన నిబద్ధత, ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఆయనతో ఉన్న సుదీర్ఘ స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, పూర్వ అధికారులు మురళీధర్, అంబరీష, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ, కల్తీ ఎరువులపై ప్రత్యేక తనిఖీలు



**జగదేవపూర్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** జగదేవపూర్ మండలం లోని నకిలీ, కల్తీ ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపడు తున్నారు. మండల వ్యవ సాయ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో మంగళవారం చాట్లపల్లి, వట్టిపల్లి, ముని గడప, అలీరాజ్‌పేట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్ల అనుమతులు, కొనుగోలు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులతో పాటు ఎరువుల లేబుల్స్, బ్యాచ్ నంబర్లు, భౌతిక నిల్వలను పరిశీలించారు. ముఖ్యంగా ఎన్‌పీకే మిశ్రమ ఎరువుల నాణ్యత, నిల్వలు, విక్రయ వివరాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని వసంతరావు తెలిపారు. నకిలీ లేదా అనుమానాస్పద ఎరువులు గుర్తిస్తే నిబంధనల మేరకు నమూనాలు సేకరించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు అధీకృత డీలర్ల వద్దే ఎరువులు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. అక్రమ విక్రయాలు లేదా అనుమానాస్పద ఎరువులు కనిపిస్తే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి షటిటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందనలు



**యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** తెలంగాణ స్టేట్ షటిటింగ్ బాల్ సీనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ గేమ్స్‌లో జనగామ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి మొదటి స్థానంలో నిలిచిన కడవెండి గ్రామానికి చెందిన సెయింట్ జాన్ డి బ్రిట్టో హైస్కూల్ విద్యార్థిని బి. హిందూను పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు. ఈ విజయం సాధించిన విద్యార్థినికి స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జయరాజ్ SVD, ప్రొక్యురేటర్ అడికల రాజ్ SVD మరియు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు (PET) అంజి ప్రశంసా పత్రాన్ని అందజేసి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# తోటి గ్రామ పంచాయతీ సిబ్బంది కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ పంచాయతీ యూనియన్ సభ్యులు



**జనగామ జిల్లా, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** దేవరుప్పుల మండలం,ధర్మాపురం గ్రామపంచాయతీ సిబ్బంది దండు సోమయ్య గత వారం మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి చిత్ర పటానికి పూలు చల్లి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10000 ఆర్థిక సాయాన్ని అందజేసిన దేవరుప్పుల మండల సిఐటియు గ్రామ పంచాయతీ యూనియన్ సభ్యులు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంగీ కర్ణాకర్,జనగామ్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి బస్వ రామచందర్, సిఐటియు జిల్లా కోశాధికారి బత్తిని వెంకన్న,మండల ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,ప్రతాప్,ఎడెల్లి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గడ్డపోతారం మున్సిపాలిటీలో కౌన్సిలర్ల తిరుగుబాటు!

### - 42 తీర్మానాలకు మూకుమ్మడి నో.. చైర్మన్ తీరుపై తీవ్ర అసంతృప్తి




**గడ్డపోతారం, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** గడ్డపోతారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో ప్రవేశపెట్టిన 42 తీర్మానాలను మెజార్టీ కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో పాలకవర్గంలో నెలకొన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. ప్రతి అంశంపై కౌన్సిలర్లతో చర్చించిన అనంతరం మాత్రమే తీర్మానాలను ఆమోదించాలని వారు పట్టుబట్టారు.కొంతమంది కౌన్సిలర్లు తెలిపిన వివరాల ప్రకారం.. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పలు అంశాలను తీర్మానాల రూపంలో సమావేశంలో ప్రవేశపెట్టడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కౌన్సిలర్లు, ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, ఇతర ముఖ్యమైన అంశాలపై ముందస్తుగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. 42 తీర్మానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మెజార్టీ కౌన్సిలర్లు సమావేశాన్ని రద్దు చేసి, నిబంధనల ప్రకారం తిరిగి సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ తాన్యాకు వినతిపత్రం అందజేసి, తిరిగి సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కౌన్సిలర్లు ఆరోపించారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. 42 తీర్మానాలపై కౌన్సిలర్లు మూకుమ్మడిగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో గడ్డపోతారం మున్సిపాలిటీ పాలకవర్గంలో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**నల్గొండ, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** బ్యాంకింగ్ సైబర్ మోసాల పట్ల ప్రజలు ప్రవక్తగా ఉండాలని, మంగళవారం నల్గొండలోని స్థానిక ఎన్జీ కాలేజీ విద్యార్థులకు అవగాహన నివారణ మరియు ఆర్ బి ఐ రిటైల్ డైరెక్ట్ స్కీం పై కార్యక్రమాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆర్ బి ఐ నల్గొండ జిల్లా లీడ్ బ్యాంక్ సహకారంతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎటిఎం కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మరియు డిజిటల్ చెల్లింపు విధానాలతో సహా వివిధ డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు.డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించే సమయంలో పాటించాల్సిన సురక్షిత విధానాలను అధికారులు వివరించారు. వ్యక్తిగత మరియు ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాల్సిన ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఫిషింగ్ దాడులు మరియు పెట్టుబడులపై అసాధారణంగా అధిక రాబడులు ఇస్తామని హామీ ఇచ్చే మోసపూరిత పథకాలు వంటి సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులను అధి కారులు అప్రమత్తం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఆర్ బి ఐ రిటైల్ డైరెక్ట్ స్కీం పై కూడా అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా వ్యక్తులుఆర్ బి ఐ వద్ద రిటైల్ డైరెక్ట్ గిల్ట్ అకౌంట్ ను ప్రారంభించి, ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడులు పెట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఐ అధికారులు శ్రీ రాజ్‌కుమార్ డాడ్జే, శ్రీ పిండి గణేష్ సాగర్, ఎస్ బి ఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ తూడి శ్రామిక్, నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ , సి ఎఫ్ ఎల్ సభ్యులు శివ, రాకేష్, రాంబాబు, స్వప్న, మాధవి మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకుడు అఖిల్ తండ్రి కాశయ్యను పరామర్శించిన నోముల భగత్

**హాలియా, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఊర అఖిల్ తండ్రి ఊర కాశయ్య ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం కొత్తపల్లి గ్రామంలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారన్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ తెలుసుకొని బుధవారం వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు కర్ణ నర్సి రెడ్డి,కురాకుల వెంకటేశ్వర్లు, వద్దే సతీష్ రెడ్డి, వర్ర వెంకట్ రెడ్డి, సర్పంచులు కూన్ రెడ్డి భాస్కర్ రెడ్డి, మజ్జిగపు నర్సి రెడ్డి, ఊర్లగొండ వెంకటయ్య, ఉడుతూరి శ్రీనివాస్ రెడ్డి, పిల్లి వెంకట్, గార్లపాటి ఎల్లయ్య, చేగొండి కృష్ణ, లకుమాల మధు బాబు, చంద్ర శేఖర్, నరేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య

### - తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
### - తొర్రూరు ఎస్ హెచ్ ఓ మహేందర్ రెడ్డి



**తొర్రూరు, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** తొర్రూరు పట్టణ కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబ కలహాలతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది.. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తొర్రూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోస్టల్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న మందుల అంకిత భర్త శశికాంత్ (25) ఎస్సీ మాదిగ కేరాఫ్ నర్సంపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న మందుల శశికాంత్ బాధితురాలు అంకిత వారి ఇరువురి మధ్య ఉన్న కలహాలతో భర్త మాటలకు మనస్థాపన చెందిన అంకిత తొర్రూరులోని అద్దెకు ఉంటున్న ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేటకు పంపించి.. ఈ విషయంపై బాధితురాలి తల్లి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# బీసీ హక్కుల కోసం మరో ఉద్యమం



**దుబ్బాక, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** దుబ్బాక నియోజకవర్గం బీసీ హక్కుల సాధన కోసం మరో ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం నాయకులు తెలిపారు మంగళవారం దుబ్బాక మండల కేంద్రంలోని అన్ని రాజకీయ పార్టీ బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అక్టోబర్ 9 వ తారీఖు నాడు దుబ్బాక నియోజకవర్గం లో బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని చేపడుతున్నామని బీసీ సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డ్ మెంబర్లు నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కూరపాటి బంగారయ్య. రాగుల సిద్ధిరాములు గౌడ్ మచ్చ శ్రీనివాస్ గుండబోయిన వెంకటేశ్వర్లు బోయ శ్రీనివాస్ శ్రీరామ్ నరేందర్ ఐరన్ సాయి తేజ గౌడ్ ఆకుల దేవేందర్ శ్రీకాంత్ యాదవ్ నక్క బాల వెంకన్న పటేల్ గోనె మధు లక్ష్మణ్ శివరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లాన్ టెన్నిస్‌లో విజేతలకు పురస్కారాలు

### - పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 50+ విభాగం పోటీలు
### - విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసిన డీసీపీ యోగేష్ గౌతమ్




**రాజేంద్రనగర్, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026లో భాగంగా నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు పురస్కారాలు అందజేశారు. వట్టినాగులపల్లిలోని విజయ్ టెన్నిస్ అకాడమీలో 50 ఏళ్లు పైబడిన విభాగంలో సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు చెవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ ట్రోఫీలు,పతకాలు అందించి అభినందించారు.పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం,క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్పోర్ట్స్ మీట్‌లు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. పోటీల నిర్వహణ బాధ్యతలను ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డీఎస్పీ ఎ.తిరుపతి పర్యవేక్షించారు.

# పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి - తాహసిల్దార్ రవీందర్



**మంగపేట, యువ వెలుగు, సెప్టెంబర్ 30 :** వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీకి అర్హులైన పట్టభద్రులు ఫామ్-18 ద్వారా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్ కోరారు. 01.11.2023 నాటికి డిగ్రీ పూర్తి చేసి, 01.11.2026 నాటికి అర్హత కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తుకు డిగ్రీ మెమో, ఆధార్, ఓటరు కార్డు, నివాస ధృవీకరణ, రెండు ఫొటోలు అవసరమన్నారు. ఆన్‌లైన్‌లో ఈసీ వెబ్‌సైట్ ద్వారా లేదా మంగపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

Editor P. Mahesh Goud, Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : 9908 502 602